క్లుప్తంగా

ప్రత్యేక అధికారిగా రామ్మోహన్‌రావు



మాకవరపాలెంలో చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

మాకవరపాలెం: మండల ప్రత్యేక అధికారిగా బి.రామ్మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ప్రత్యేక అధికారి మనోరమ స్థానంలో రామ్మోహన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మితో కలసి తామరం, మాకవరపాలెం చెత్త సంపద కేంద్రాలను ఆయను పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 14న జరిగే బాలల దినోత్సవంలో బహుమతులు అందిస్తామని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు.

అర్జీలను సకాలంలో పరిష్కరిస్తాం



రైతుల నుంచి వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: రైతుల నుంచి వచ్చిన వినతులన్నీ పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ శెట్టి నాగమ్మ అన్నారు. కంచుగుమల రెవెన్యూ గ్రామం సచివాలయంలో శుక్రవారం రెవిన్యూ గ్రామ సభ నిర్వహించారు. భూ సర్వేలో తలెత్తిన సమస్యలతో, పాటు వివిధ సమస్యలకు సంబంధించి రైతులిచ్చిన సుమారు 59 అర్జీలను స్వీకరించారు.మండల సర్వేయర్ రెడ్డి తవిటినాయుడు, సహాయ సర్వేయర్లు గిరిజ, రాజ్యలక్ష్మి, మేఘన, వీఆర్వో లక్ష్మణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పేరంటాలు పండగ

కె.కోటపాడు : పొడుగుపాలెం గ్రామస్తులు ముత్యాలమ్మ పేరంటాలు పండగను శుక్రవారం ఘనంగా జరిపారు. ప్రతి ఏటా కార్తీకమాసంలో గ్రామస్తులు ముత్యాలమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి పూజా కార్యక్రమాలను జరపనున్నారు. పండగ సందర్భంగా పేరంటాలు ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



గుల్లేపల్లిలో పరిశుభ్రతా పనులు పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ అప్పలరాజు

కె.కోటపాడు : గ్రామంలో పరిశుభ్రతా పనులను పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు అన్నారు. గుల్లేపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. సర్పంచ్ బండారు దేముళ్లు ఎంపీటీసీ దేముడుబాబు పాల్గొన్నారు. వారాడలో జరిగిన పరిశుభ్రతా పనులల్లో ఈవోఆర్డీ రమణ, పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, చౌడువాడలో ప్రత్యేక పారిశుధ్య పనుల్లో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

సొంత గూడు లేదు... గోడు పట్టదు!

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇరుకు గదులు, రేకుల షెడ్లలో నిర్వహణ
- కేంద్రాల్లో కనీస సదుపాయాలు కరువు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు
- పలు గ్రామాల్లో అసంపూర్తిగానే అంగన్‌వాడీ కేంద్రాలు

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు :	76
సొంత భవనాలు ఉన్నవి :	17
దేవరాపల్లిలో సొంత భవనం లేని కేంద్రాలు :	8
అసంపూర్తిగా ఉన్న భవనాలు :	30



దేవరాపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

దేవరాపల్లి : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేక ఇరుకు గదులు, రేకుల షెడ్లు, సామాజిక భవనాలలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సదుపాయాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో నిర్మాణ పనులు ప్రారంభించిన అంగన్‌వాడీ భవనాలు ఇపుడు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో స్థలం కేటాయించక సొంత భవనాలు సమకూరలేదు. మండల కేంద్రంలో 8 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అన్నీ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. మూడు భవనాలకు నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దేవరాపల్లి మండలంలో 76 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 71 మెయిన్, 5 మినీ కేంద్రాలు ఉన్నాయి. 71 మెయిన్ అంగన్‌వాడీలకు 17 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, 5 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. మరో 30 కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటి నిర్మాణంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించక పోవడంతో ముందుకు సాగడం లేదు. మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలను కేటాయించి అంగన్‌వాడీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. మండలంలోని 76 అంగన్‌వాడీల పరిధిలో ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలు 1123 మంది, మూడు నుంచి ఆరు ఏళ్ల లోపు చిన్నారులు 561 మంది, గర్భిణులు 194 మంది, బాలింతలు 223 మంది పౌష్టికాహారం అందుకుంటున్నారు.



దేవరాపల్లిలో ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ చిన్నారులకు బోధిస్తున్న సిబ్బంది



దేవరాపల్లిలో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



కె.కోటపాడు ప్రాజెక్టు పరిధిలోని దేవరాపల్లి మండలంలో 76 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 17కు సొంత భవనాలు ఉన్నాయి. దాదాపుగా 30 భవనాలు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. కొన్నింటికి స్థలాలు కేటాయించక పోవడంతో సొంత భవనాలు సమకూరడం లేదు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి అంగన్‌వాడీ కేంద్రాల స్థితిగతులపై వివరాలు అందించాం.

–వి.మంగతాయారు, ఐసీడీఎస్ సీడీపీవో, కె.కోటపాడు ప్రాజెక్టు

ముమ్మరంగా పూడికతీత పనులు



పెదబొడ్డేపల్లి వద్ద మెయిన్‌రోడ్డు డ్రెయిన్‌లో పూడిక తొలగింపు

నర్సీపట్నం : పట్టణంలోని పూడికతో నిండిపోయిన డ్రెయిన్‌లను పరిశుభ్రతకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. పెదబొడ్డేపల్లి ఆర్డీవో బంగా వద్ద నుండి పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర విలేకరులతో మాట్లాడుతూ కాలువల్లో పూడిక తొలగింపునకు ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసిందన్నారు. మున్సిపాలిటీలో మెయిన్ డ్రెయిన్‌తో పాటు 28 వార్డుల్లోని మురుగు కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టామని తెలిపారు.

ఐలాజ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి



మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం : వచ్చే నెల 8న కాకినాడ జిల్లా అన్నవరంలో నిర్వహిస్తున్న ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ట ప్రభాకర్ పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. న్యాయవాదులంతా విధిగా హాజరవ్వాలని కోరారు. ప్రజల హక్కులను కాపాడడంలో ఐలాజ్ ముందుంటుందన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలన్నారు. మానవ హక్కులు, పౌర హక్కుల కోసం పోరాడే న్యాయవాదులపై ప్రభుత్వాలు నిరంకుశ నల్ల చట్టాలను ప్రయోగించడాన్ని ఆపాలన్నారు. కార్యక్రమంలోఐలాజ్ కన్వీనర్ బుగత శివ, కన్వీనింగ్ కమిటి సభ్యురాలుఎ.దేవి, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.శివకృష్ణ, సీనియర్ న్యాయవాదులు పి.నరసింహ, స్వామినాయుడు, కన్నయ్యనాయుడు, విజయప్రసాద్, కె.రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

జన సురక్ష వర్తింపజేయాలి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

కె.కోటపాడు : బ్యాంక్‌లలో ప్రతి ఖాతాదారునికి అర్హత బట్టి జన సురక్షా బీమా పథకాలు అందించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ అన్నారు. కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల బ్యాంక్ అధికారులతో జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఖాతాదారులకు పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వర్తింపజేయాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల్లో డ్వాక్రా సంఘాల సభ్యులు వ్యాపారాలు చేయాలనుకుంటే వారికి రూ.లక్షా 50వేల రుణాలను మంజూరు చేయాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాజు, డీపీఎం కుమారస్వామి, చౌడువాడ ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ శ్రావణ్‌బాబు, ఎస్‌బీఐ మేనేజర్ హరికృష్ణ, ఏపీఎం చినబాబు, ఇండస్ట్రీయల్ ప్రమోషనల్ అధికారిణి త్రివేణి పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం



మాడుగులలో ఖరీఫ్ వరి పనలు కూడదీస్తున్న రైతులు

మాడుగుల : మండలంలో ఈ ఏడాది శుక్రవారం నుంచి ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం అయ్యాయి. అయితే ఆరుతడి పంటలుగా రైతులు వరి కోతలకు వారం రోజులు ముందుగా ఖరీఫ్ వరి చేలలో రబీ పంటలుగా మినుములు, పెసలు, బొబ్బరులు కోతలు కోయక ముందు జల్లుతారు. అయితే ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమైనా సరే రబీ వరి విత్తనాలు ఆచూకీ లేదని, రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలో 11 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి చేలు వేశారు. దాదాపుగా చేలన్నీ పంట దశకు చేరుకున్నాయి. ఈ విషయమై వ్యవసాయాధికారి వాసుదేవరావును సంప్రదించగా మరో వారం రోజుల్లో రబీ విత్తనాలు రానున్నాయన్నారు.

మార్గమధ్యంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్

- ప్రయాణికుల ఇక్కట్లు



రోలుగుంట కూడలి వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్

రోలుగుంట : నర్సీపట్నం నుంచి చోడవరం వెళ్లే ఆర్టీసీ బస్ శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కూడలి దాటిన తరువాత మరమ్మతుకు గురై నిలిచిపోయింది. ఈ బస్‌లో సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. మార్గమధ్యంలో బస్ నిలిచిపోవడంతో వారంతా ఇక్కట్లు పడ్డారు. ఇదే రూట్‌లో దీని తరువాత బస్ కూడా ఖాళీ లేక నిండుగా ప్రయాణికులతో వెళ్లిపోయింది. దీంతో బస్ మరమ్మతు పూర్తయ్యే వరకూ ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. ఆర్టీసీ యాజమాన్యం స్పందించి కండిషన్ గల బస్‌లు నడపాలని, సకాలంలో ప్రయాణికులను గమ్యం చేర్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గెస్టు ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

గొలుగొండ : గొలుగొండ గురుకుల కళాశాలలో హెల్త్ సూపర్‌వైజర్ (గెస్టు ఫ్యాకల్టీ)గా పనిచేయడం కోసం అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఉమ్మడి విశాఖ జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి నుంచి ఆదేశాలు వచ్చినట్టు గొలుగొండ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరావు తెలిపారు. అర్హత ఉన్న వారు ఈ నెల 11న తాళ్లపాలెంలో జరిగే డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జెరాక్సు కాపీలు తీసుకొని హాజరుకావాలని తెలిపారు.

ఓటరు సవరణ కార్యక్రమంపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు

రోలుగుంట : ఓటరు జాబితా సవరణ ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.నాగమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు కోరారు. తన కార్యాలయంలో తహసీల్దార్ శుక్రవారం మండల స్థాయి బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక క్యాంపెయిన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో గల 43 బూత్ కేంద్రాల వద్ద ఈ నెల 9,10 తేదీల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. ఫారం 6,7,8ల సమాచారం (వలసలు, మరణాలు, చిరునామా, తప్పుల సవరణ, మార్పులు, చేర్పుల)ను సేకరించి దరఖాస్తుల్లో ఎలా పొందుపరచాలో బీఎల్వోలకు వివరించారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



సభలో మాట్లాడుతున్న ఈసీ రాధిక

గొలుగొండ : జాతీయ ఉపాధి హామీ పథకంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడం జరుగుతుందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ రాధిక తెలిపారు. జోగుంపేటలో ఉపాధి పనులపై నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామంలో గుర్తించిన పనులు పూర్తి చేస్తామన్నారు. కొత్తగా ఉపాధి కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్పంచ్ జువ్వల లక్ష్మి, మాజీ సర్పంచ్ వరహాలబాబు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ఏర్పాటు



శివాలయంలో ధ్వజస్తంభం

గొలుగొండ : కొంకసింగి గ్రామంలో గతంలో నిర్మించిన శివాలయం వద్ద శుక్రవారం మాజీ సర్పంచ్ చెల్లూరి సత్యనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన

మాడుగుల రూరల్ : పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శి దృష్టి సారించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలో వంటర్లపాలెం చెత్త నుంచి సంపద కేంద్రాలు పరిశీలించారు. తడి, పొడి చెత్తలు వేర్వేరుగా వేయడం ద్వారా ఎరువులు తయారై పంచాయతీకి ఆదాయం పెరగడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా మారుతాయన్నారు.

జీడిపంటకు బీమా చేయించుకోండి



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి

కె.కోటపాడు : జీడిపంటను సాగు చేసే రైతులు పంటకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి అన్నారు. ఆర్లి గ్రామంలో జీడిపంట సాగు రైతులతో సమావేశమైన ఆమె ఎకరా విస్తీర్ణంలో గల జీడిపంటకు సాగు రైతులు బీమా కింద రూ.1540 చెల్లించాలని తెలిపారు. ఈ నెల 15లోగా రైతులు బీమా చేయించుకోవాలన్నారు. బీమా పథకంలో చేరాలనుకునేవారు 99511 42337ను సంప్రదించాలని కోరారు.

ఎంపీడీవోకు 104 సిబ్బంది వినతిపత్రం



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

మాడుగుల రూరల్ : మూడు నెలలుగా 104 సిబ్బంది వేతనాలు అందక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని 104 కోఆర్డినేటర్ భార్గవ్ సింహాచలంనాయుడు అన్నారు. ఎంపీడీవో అప్పారావుకు గురువారం ఉద్యోగులు వినతిపత్రం అందించారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీవో నెంబర్ 7 ద్వారా వేతనాలను ఇవ్వాలని కోరారు. సిబ్బంది మనీష్, గంగాధర్, విజయ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి

గొలుగొండ : టమాటా సాగులో తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు అందించడం జరుగుతుందని ఉద్యానవనశాఖ అధికారి శిరీష తెలిపారు. లింగంపేట, గైరంపేట, రామచంద్రపురం గ్రామాల్లో టమాటా పంటకు తెగుళ్ల సోకడంతో శుక్రవారం ఆయా చోట్ల పర్యటించి రైతులకు అవగాహన కలించారు. బాక్టీరియా రాకుండా వాటి నివారణకు ట్రైకోడెర్మావిరిడే లేదా, సుడోమోనాస్ మందును విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆత్మ బీటీఎం కిషోర్ పాల్గొన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు సూచించారు. నాగయ్యపేటలో శుక్రవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. సంపద కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ త్రినాథరావు, వీఆర్వో జానకీ, ఏఎన్ఎం సత్యవతి పాల్గొన్నారు.

అందరూ అక్షరాస్యులు కావాలి

నాతవరం : వేలిముద్రలు వేసే వారందరికీ సంతకం నేర్పించడమే ఉల్లాస్ కార్యక్రమం ధ్యేయమని ఎంఈవో వరహాలబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల వ్యాప్తంగా స్వచ్ఛందంగా వయోజనులకు అక్షరాస్యత కల్పించడానికి 50 మంది వలంటీర్లు ముందుకు వచ్చారన్నారు.

జీవన నైపుణ్యాలు పెంపొందేలా ఉల్లాస్ కార్యక్రమం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమణమ్మ

నర్సీపట్నం : ప్రతి మహిళా చదవడం, రాయడం నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉల్లాస్ అక్షర వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ సుకల రమణమ్మ పేర్కొన్నారు. ఉల్లాస్ టీచర్స్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వెలుగు ఏపీఎం రమాకుమారి ఉల్లాస్ పాఠ్యాంశాలను ఏవిధంగా బోధించాలో డిజిటల్ స్క్రీన్‌పై టీచర్స్‌కు వివరించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీరంగస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నికృష్ణ

కె.కోటపాడు : ఎస్‌హెచ్‌జీ సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు యువజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.చిన్నికృష్ణ అన్నారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మొదటి విడతగా 490 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు.సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, ఏపీఎం చినబాబు, సీసీలు పాల్గొన్నారు.

జీడితోటల బీమా రైతులకు ధీమా



జీడిరైతులతో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి భానుపుష్ప లీలావతి

చోడవరం రూరల్ : జీడిమామిడి రైతులకు బీమా ఎంతగానో ఉపకరిస్తుందని మండల ఉద్యానవన అధికారి భానుపుష్ప లీలావతి అన్నారు. శుక్రవారం అద్దూరు గ్రామంలో అద్దూరు, నర్సాపురం, వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన జీడిమామిడి రైతులకు పంటల బీమా గురించి తెలిపారు. స్వచ్ఛంద బీమా పథకంలో ఎకరాకు రూ.1540 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అధిక వర్షాలు, తీవ్రమైన పొగమంచు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంట నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.30,800 వరకూ నష్ట పరిహారం అందుతుందన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు జీడి రైతులు తమ బీమా ప్రీమియం చెల్లించడానికి గడువు ఉందని తెలిపారు.

104 సిబ్బంది నిరసన

చోడవరం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 వాహనం మొబైల్ వైద్య సేవల బృందం శుక్రవారం నిరసన తెలిపారు. తమకు రావలసిన మూడు నెలల జీత భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, 104 వాహనం వైద్యసేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా జరగాలని డిమాండ్ చేశారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు జీఓ నెం.7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, గతంలో వసూలు చేసిన పీఎఫ్‌ను చెల్లించాలని కోరుతూ వినతి పత్రాన్ని మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ అమ్మాజీకి అందజేశారు.

దివ్య అఖండ నామ సంకీర్తన నేడు

దేవరాపల్లి : ఎ. కొత్తపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు విశ్వ వ్యాప్త దివ్య అఖండ నామ సంకీర్తన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సంస్థల ప్రతినిధులు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 24 గంటల పాటు ఏకధాటిగా జరిగే ఈ అఖండ నామ సంకీర్తనలో సత్యసాయి భక్తులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి దివ్య అనుగ్రహ ఆశీస్సులు పొందాలని వారు ఆకాంక్షించారు.

11న డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ

మాడుగుల : ఈ నెల 11వ తేదీన స్థానిక వెలుగు కార్యాలయంలో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమం జరగనుందని, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. వెలుగు వీవోఏలు ద్వారా గుర్తించిన నిరక్షరాస్యులకు వలంటీర్ టీచర్ల ద్వారా విద్య నేర్పుటకు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్‌లు, వీవోఏలు హాజరుకావాలన్నారు.

యానిమేటర్ల నిరసన




దేవరాపల్లి వెలుగు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యానిమేటర్లు

దేవరాపల్లి : తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెలుగు వీవోఏ (యానిమేటర్లు)లు వెలుగు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. వీవోఏలకు 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఐదు నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఆందోళనలో గ్రెడ్డి రాము, కాటపల్లి అప్పారావు పాల్గొన్నారు.

రెవెన్యూసభలో 67 అర్జీలు



ఎ.కోడూరులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్



నాతవరం : గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ భాగ్యవతి ఆధ్వర్యంలో రీసర్వే గ్రామసభను నిర్వహించారు. పట్టాదార్ పాస్ పుస్తకాల్లో తప్పులను సరి చేయాలని 67 మంది అర్జీలను అందించారు. మండల సర్వేయర్ రామచంద్ర మూర్తి, సర్పంచ్ అక్కునాయుడు, ఎంపీటీసీ గౌతమి, మాజీ సర్పంచ్ మల్లేశ్వరరావు, వీఆర్వో సూర్యనారాయణ పాల్గొన్నారు.

నాతవరం: మండలంలోరామచంద్రరాజు అగ్రహారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసదస్సులో రైతులు నుంచి 8 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎ.,వేణుగోపాల్ అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు ప్రసాద్ సచివాలయ సర్వేయరు విజయకుమార్ పాల్గొన్నారు.